ఇంగ్లిష్ ల్యాబ్, టెన్నిస్ కోర్ట్ ప్రారంభం

ల్యాబ్‌ను ప్రారంభించి కంప్యూటర్లను పరిశీలిస్తున్న సీఎండీ బలరాం

కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 16: కొత్తగూడెం సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఇంగ్లిష్ ల్యాబ్‌ను, ఇల్లెందు బంగ్లోస్ ఏరియాలో సింథటిక్ లాన్ టెన్నిస్ కోర్టును సింగరేణి సీఎండీ బలరాం శుక్రవారం ప్రారంభించారు. డైరెక్టర్లు ఎన్‌వీకే శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి, సత్యనారాయణరావు, జీఎంలు ఎస్‌డీఎం సుభాని, బీఆర్ దీక్షితులు, బెనెడిక్ట్ నికోలస్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాటాయిగూడెంలో హోమియో వైద్యశిబిరం

వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యురాలు ఉషారాణి

దుమ్ముగూడెం, ఆగస్టు 16: మండలంలోని కాటాయిగూడెం ప్రైమరీ పాఠశాలలో ఆర్లగూడెం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆధ్వర్యంలో ఉచిత హోమి యో వైద్య శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. వైద్యురాలు ఉషారాణి రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో డీపీఎం మహేశ్‌గౌడ్, ఫార్మాసిస్ట్ రజితా, ఎస్‌సీఎస్ ఈశ్వరి, విజయ్‌కుమార్, కిషోర్, తనూజ, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు రమణ, రమ్య, రమణ, అరుణ పాల్గొన్నారు.

ఈజీఎస్‌లో గోల్‌మాల్

వివరాలు వెల్లడిస్తున్న ఆడిట్ బృందం బాధ్యులు

చండ్రుగొండ, ఆగస్టు 16: మండలంలో ఉపాధి హామీ పథకం(ఈజీఎస్)లో 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన రూ.3.51కోట్ల విలువైన పనుల్లో గోల్‌మాల్ జరిగినట్లు ఆడిట్ బృందం గుర్తించింది. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రజావేదికను ఎస్ఆర్‌పీ కొమరయ్య నిర్వహించారు. 14 మంది డీఆర్‌పీలు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, సోషల్ ఆడిట్ రిపోర్ట్‌ను ప్రజావేదిక ముందుంచారు. అడిషినల్ డీఆర్‌డీవో రవికుమార్ మాట్లాడుతూ.. అవినీతిపరులపై చర్యలుంటాయని హెచ్చరించారు. గోల్‌మాల్ జరిగిన రూ.1.40లక్షలను తిరిగి రాబడతామన్నారు. మంగయ్యబంజర, బెండాలపాడు పంచాయతీల్లోని ఇద్దరు మేట్లపై చర్యలు తీసుకోనన్నట్లు చెప్పారు. జిల్లా విజిలెన్స్ అధికారి రామన్, ఆంబుడ్స్‌మెన్ ఆఫీషర్ నాగ ప్రసాద్, అసిస్టెంట్ జిల్లా విజిలెన్స్ అధికారి అనూష, ఎంపీడీవో అశోక్, క్యూసీ అనిల్ పాల్గొన్నారు.

వసతిగృహాలను సందర్శించిన తహసీల్దార్

వసతి గృహాల్లో రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ అశోక్‌కుమార్

దుమ్ముగూడెం, ఆగస్టు 16: దుమ్ముగూడెంలో కస్తూర్బాగాంధీ పాఠశాల, బీసీ బాలుర వసతి గృహాలను తహసీల్దార్ అశోక్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. వసతిగృహాల్లో విద్యార్థులకు అందుతున్న భోజనం, రికార్డులు పరిశీలించారు. కస్తూర్బాగాంధీ పాఠశాలలో బోరుబావి పనిచేయడంలేదని, మిషన్ భగీరథ పైపు మరమ్మతులకు గురికావడంతో సంబంధిత ఏఈకి ఫోన్ చేసి మరమ్మతులు చేయించాలని సూచించారు. బాలుర బీసీ వసతి గృహంలో ఆర్వో ప్లాంట్‌ను తనిఖీ చేశారు.

విద్యార్థులకు అభినందన

విదార్థులను అభినందిస్తున్న యాజమాన్యం, ఉపాధ్యాయులు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఆగస్టు 16: స్వాతంత్ర్య దిన వేడుకల్లో భాగంగా రెండు ప్రైవేటు కంపెనీలు నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో స్థానిక మేదరబస్తీలోని శ్రీరాగా విద్యార్థులు జాహ్నవి, ఆయేషా, చైతన్య, రేశ్వంత్, స్వరణ్, గణవి విజేతలుగా నిలిచారు. వీరిని పాఠశాల కరస్పాండెంట్ వరప్రసాద్, డైరెక్టర్ కవిత, ఉపాధ్యాయులు రాంబాబు, సంధ్య, యాస్మిన్, చైతన్య అభినందించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

మా ఇంట కొలువుండు.. మా మహాలక్ష్మి..

అశ్వారావుపేట రూరల్: ముత్తైదువులకు వాయనం ఇస్తున్న మహిళ

జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజును వరలక్ష్మీ వ్రతంగా జిల్లాలోని మహిళలు అత్యంత భక్తిశ్రద్ధతలతో జరుపుకున్నారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా పలు దేవాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. మహిళలు ఎంతో పవిత్రంగా భావించే వరలక్ష్మీ వ్రతాన్ని వారు తమ ఇళ్లల్లో ఘనంగా నిర్వహించుకున్నారు. శుక్రవారం వేకువ జామునే నిద్రలేచి చన్నీటి స్నానాలు ఆచరించి నూతన పట్టు వస్త్రాలను ధరించారు. ఇంటి గుమ్మాలకు మామిడి తోరణాలను కట్టి శోభాయమానంగా తీర్చిదిద్దుకున్నారు. ఇంట్లో వరలక్ష్మీ అమ్మవారి ప్రతిమను కొలువుంచి ప్రత్యేక పూజలు చేశారు. తీరొక్క పూలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ రకరకాల పిండివంటకాలు, పండ్లు, తీరొక్క స్వీట్లు తయారు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. 'రావమ్మా మహాలక్ష్మి.. రావమ్మా..' అంటూ లక్ష్మీదేవిని తమ ఇళ్లకు ఆహ్వానించారు. అంతేగాక ఉదయం వ్రతమాచరించిన మహిళలను సాయంత్రం తమ ఇళ్లకు ఆహ్వానించి వాయినం అందజేశారు. పలు ఆలయాల్లో కమిటీ సభ్యులు సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా అమ్మవారి దేవాలయాలు భక్తులతో కిక్కిరిశాయి.

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఆగస్టు 16

అన్నపురెడ్డిపల్లి: పూజలు చేస్తున్న భక్తులు, అశ్వారావుపేట టౌన్: పూజలు చేస్తున్న భక్తురాలు, చుంచుపల్లి: ముత్తైదువుల ఆశీర్వచనాలు తీసుకుంటున్న మహిళలు

లక్ష్మీదేవిపల్లి: పూజల్లో పాల్గొన్న మహిళలు, కొత్తగూడెం టౌన్, టేకులపల్లిలో పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే, మహిళలు, పాల్వంచ: పూజలు చేస్తున్న మహిళలు

ఆళ్లపల్లి: పూజలు చేస్తున్న మహిళలు

పర్ణశాల: పూజలు చేస్తున్న అర్చకులు

కొత్తగూడెం: పూజలు చేస్తున్న భక్తురాలు

రామాలయంలో సామూహిక సహస్రనామ కుంకుమార్చన

సహస్ర కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

బూర్గంపహాడ్, ఆగస్టు 16: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రావణ శుక్రవా రం సందర్భం గా వరలక్ష్మీవ్రతం, బేడా మండపంలో సాయంత్రం 4 నుంచి 5 గం టల వరకు అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. తొలుత అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ ఈవో రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ట్రాన్స్‌కో ఏఈకి సన్మానం

ట్రాన్స్‌కో ఏఈని సన్మానిస్తున్న కాంట్రాక్టర్, సిబ్బంది

సారపాక, ఆగస్టు 16: సారపాక సబ్‌స్టేషన్‌లో ఏఈగా పనిచేస్తున్న గు ర్రం ఉపేందర్ ఉత్తమ ఏఈగా ప్రశంసాపత్రం అందుకున్న సందర్భంగా సివిల్ కాంట్రాక్టర్ హనుమంతు ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, లైన్‌ఇన్‌స్పెక్టర్ శంకర్, లైన్‌మెన్ వెంకట్రావు, అసిస్టెంట్ లైన్‌మెన్ ఎం ప్రసాద్, జూనియర్ లైన్‌మెన్ శ్రీనివాసరావు, సిబ్బంది రవి, హనుమంతు, ఆపరేటర్ మధు పాల్గొన్నారు.

'సీతారామ' మార్పుతో రైతులకు అన్యాయం

చండ్రుగొండ, ఆగస్టు 16: సీతారామ ప్రాజెక్ట్ డిజైన్ మార్పుతో భద్రాద్రి జిల్లా రైతులకు అన్యాయం జరుగుతున్నదని రైతు సంఘం మండల నాయకుడు పెద్దిని వేణు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ముగ్గురు మంత్రులున్న ప్రాంతానికే ఉపయోగపడేలా నీటిని దొడ్డిదారిన తరలించుకుపోతున్నారని ఆరోపించారు. నాయకులు విప్పర్ల పెద్ద వెంకటేశ్వర్లు, రాయి రాజా, పోట్రు వీరభద్రం, మరకాల లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇస్రోలో సీటు సాధించిన సారపాక విద్యార్థి నిలోఫర్

సారపాక, ఆగస్టు 16: బూర్గంపహాడ్ మండలం సారపాక గ్రా మానికి చెందిన ఐటీసీ ఉద్యోగి షేక్ నన్నేమియా కుమార్తె షేక్ నిలోఫర్ ఇస్రోలో బీటెక్ ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో సీటు సాధించింది. నీలోఫర్ ఐటీసీ బీపీఎల్ స్కూల్‌లో 10వ తరగతి, ఇంటర్ హైదరాబాద్‌లోని నారాయణ కళాశాల, ఐఐటీ చత్తీస్‌గఢ్‌లోని బిలాయ్‌లో చదివారు. నీలోఫర్‌కు ఇస్రోలో సీటు దక్కడం పట్ల తండ్రి నన్నేమియా కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మధు

కరకగూడెం,ఆగస్టు 16: ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి మధు సూచించారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని పడిగాపురం, గొల్లగూడెం, కౌలురు గ్రామాల్లో డ్రైడే తోపాటు జ్వర సర్వే నిర్వహించారు. పలువురిని జ్వరపీడితులుగా గుర్తించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మధు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో పొలెబోయిన కృష్ణయ్య, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డెంగీతో యువకుడు మృతి

ఖమ్మం రూరల్, ఆగస్టు 16 : డెంగీ వ్యాధితో చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతిచెందిన ఘటన తీర్థాల గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మాచర్ల మధు(30) మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఖమ్మంలో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోవడంతో డెంగీ అని నిర్ధారణ అయ్యింది. అంతేకాక లివర్‌కు ఇన్‌ఫెక్షన్ కావడంతో మెరుగైన వైద్యం కోసం సదరు యువకుడిని కుటుంబ సభ్యులు వరంగల్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. కాగా.. కొద్ది నెలల్లోనే ఇదే గ్రామంలో ముగ్గురు వ్యక్తులు డెంగీతో మృతిచెందినట్లు తెలిసింది.

'విద్యలో రాణిస్తేనే భవిష్యత్'

మధిర, ఆగస్టు 16: విద్యలో ఉన్నతంగా రాణించినప్పుడే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని, మెరుగైన అవకాశాలు లభిస్తాయని ఎస్‌జేకేఎం విద్యాసంస్థల డైరెక్టర్ డీ.సత్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక శ్రీనిధి డిగ్రీ కళాశాలలో కళాశాల చైర్మన్, ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్‌నెహ్రూ అధ్యక్షతన శుక్రవారం జరిగిన కళాశాల ఫ్రెషర్స్‌డే వేడుకల్లో మాట్లాడారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అండ్ డైరెక్టర్ రమేష్, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ఏవో పాల్గొన్నారు.

సులానగర్ 'ఛీ'హెచ్‌సీ..!

''జ్వరం వచ్చిందని సులానగర్ పీహెచ్‌సీకి వెళ్తే డాక్టర్ లేరు. మందోమాకో ఇచ్చేందుకు సిబ్బంది లేరు. తీరా ఎప్పటికో వచ్చిన డాక్టర్ గారు మందుల చీటీ చేతుల పెట్టారు. అక్కడ మందులు మాత్రం లేవు(ట). ఛీఛీ.. ఇదేం ఆస్పత్రి..? ఇదేం 'ఛీ(పీ)హెచ్‌సీ..!'' – మండలంలోని సులానగర్ పీహెచ్‌సీలో వైద్య సేవల కోసం వచ్చిన రోగుల ఆవేదన–ఆగ్రహం ఇది.

టేకులపల్లి, ఆగస్టు 16: మండలవ్యాప్తంగా సీజనల్ జ్వరాలు పెరుగుతున్నాయి. సులానగర్ పీహెచ్‌సీలో వైద్య సేవలు అందడం లేదన్న సమాచారంతో ఆ ఆస్పత్రికి శుక్రవారం 'నమస్తే' వెళ్లింది. అప్పటికి అక్కడ నాలుగు రోజుల నుంచి ఒక్కరంటే ఒక్క డాక్టర్ కూడా లేరట. ఇదే విషయాన్ని అక్కడి వైద్యాధికారిని అడిగితే.. ''ఇక్కడ నాతోపాటు మరో డాక్టర్ ఉండాలి. కానీ, ఆ పోస్ట్ ఖాళీగా ఉంది. నేనొక్కడినే ఉన్నాను. నేను కూడా నాలుగు రోజులకుపాటు సెలవులో ఉన్నాను. ఈ రోజే వచ్చాను. ఇక్కడ వైద్య సిబ్బంది కొరత ఉంది. మందులు కూడా సరిపడినన్ని లేవు. ఏడు బెడ్లు మాత్రమే ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో నేను మాత్రం ఏం చేయగలను..?'' అంటూ, ఆస్పత్రి వాస్తవిక పరిస్థితిని ఆ వైద్యాధికారి వివరిస్తూ, నిస్సహాయత వ్యక్తం చేశారు. అక్కడున్న రోగుల్లో కొందరిని 'నమస్తే' పలకరించింది. తాము ఉదయం 9.00 గంటలకు వచ్చామని, మధ్యాహ్నం 3.00 గంటల వరకు కూడా పట్టించుకున్న వారు లేరని చెప్పారు. తాము ఇక్కడకు వస్తే వైద్యం–మందులు అందుతాయన్న నమ్మకంగానీ, జబ్బు తగ్గుతుందన్న ఆశగానీ ఏమాత్రం లేదని అనేకమంది రోగులు

సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ముక్తకంఠంతో, ఒకింత ఆగ్రహం–ఆవేదనతో చెప్పారు. చాలినంతమంది వైద్యులు/సిబ్బంది/మందులు/సదుపాయాలు లేని ఈ పీహెచ్‌సీని నమ్ముకోవడమంటే.. ప్రాణం మీద తీపిని వదలుకున్నట్లేనని కొందరు రోగులు నిరాశాపూరిత స్వరం వినిపించారు.

సూది వేయలేదు.. మందులు ఇవ్వలేదు..

నా పేరు భూక్యా వెంకన్న. టేకులపల్లి పంచాయతీ ఏ–కాలనీ తండా. జ్వరం వచ్చింది. ఈ రోజు (శుక్రవారం) ఉదయం తొమ్మిదింటికి వచ్చాను. మధ్యాహ్నం 3.00 గంటలకు డాక్టర్ చూసి, మందులు రాసిచ్చారు. మందులు లేవన్నారు. సూది కూడా వెయ్యలేదు. నాకు చాలా బాధగా ఉంది. హాస్పటల్‌లో సిబ్బంది నిర్లక్ష్యం వలన రోగులు ఇబ్బంది పడుతున్నారు.

సూది వేసి.. రేపు రమ్మన్నారు..

నా పేరు బొండుల శారద, కోయగూడెం గ్రా మం. ఈ సులానగర్ ఆస్పత్రికి మధ్యాహ్నం 12.30 గంటలకు జ్వరంతో వచ్చాను. డాక్టర్ లేరు. ఎవరూ పట్టించుకోలేదు. రెండు గంటల తర్వాత.. ఒక్క సూది వేసి, రేపు మళ్లీ రమ్మన్నారు. డాక్టర్, సిబ్బంది ఇష్టం వచ్చినపుడు వస్తున్నారు, పోతున్నారు. ప్రస్తుతం జ్వరాల సీజన్ కావు న వైద్యశాలలో సిబ్బంది డాక్టర్ అందుబాటు లో ఉండేలా చూడాలి.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాల్వంచ, ఆగస్టు 16: స్థానిక ఇందిరా కాలనీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. హమాలీ కాలనీ, వికలాంగుల కాలనీ, జయమ్మ కాలనీ, కాంట్రాక్టర్స్ కాలనీ, బాపూజీనగర్, వెంకటేశ్వర హిల్స్ కాలనీ ఏరియాల్లో ఉదయం 11.00 నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

భద్రాద్రిలో ఓపీ సేవలు బంద్

బూర్గంపహాడ్, ఆగస్టు 16: కలకత్తాలో వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యకు నిరసనగా భద్రాచలం ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు ఓపీ సేవలు నిలిపివేసి నిరసన తెలుపుతామని నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జ్వరాల తీవ్రతను తగ్గించాలని వినతి

అశ్వారావుపేట టౌన్, ఆగస్టు 16: గ్రామీణ ప్రాంతాల్లో జ్వరాల తీవ్రతను తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర కోశాధికారి వాసం బుచ్చిరాజు, సీపీఐ–ఎంఎల్ మాస్‌లైన్ పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్ శుక్రవారం అశ్వారావుపేట సీహెచ్‌సీ డాక్టర్ విద్యాసాగర్‌కు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు కుంజా అర్జున్, కంగాల భూలక్ష్మి, మంగరాజు, కొమరం భీమరాజు, కారం వెంకటేష్, సోడెం కన్నారావు, కంగాల వెంకటేష్ పాల్గొన్నారు.

ఫ్రైడే-డ్రైడే

అశ్వారావుపేట టౌన్, ఆగస్టు 16: స్థానిక శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శి కోటమర్తి శ్రీరామ్మూర్తి పర్యవేక్షించారు. ఆశ కార్యకర్తలు నిర్వహిస్తున్న ఇంటింటి జ్వర సర్వేలో పాల్గొన్నారు.

నిర్మాణ పనుల పరిశీలన

పాల్వంచ రూరల్, ఆగస్టు 16: మండలంలోని తోగ్గూడెంలో నిర్మాణంలోగల 26 ఇంకుడు గుంతలను ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో రంగా, పంచాయతీ కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.

పోస్టుల భర్తీకి 22న ఇంటర్వ్యూలు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఆగస్టు 16: స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న 105 పోస్టులను భర్తీ చేసేందుకు ఈ నెల 22న ఐడీవోసీలో వాక్–ఇన్–ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటలో తెలిపారు. ధ్రువపత్రాలతో హాజరుకావాలని పేర్కొన్నారు.

చెక్కుల పంపిణీ

దమ్మపేట, ఆగస్టు 16: దమ్మపేట మండలంలోని కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులు మొత్తం 97 మందికి చెక్కులను వారి ఇళ్ల వద్ద ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శుక్రవారం పంపిణీ చేశారు. తహసీల్దార్ నరేష్ పాల్గొన్నారు.

తీజ్ వేడుకలకు ఆహ్వానం

టేకులపల్లి, ఆగస్టు 16: ఈ నెల 18న టేకులపల్లలి జరిగే తీజ్ వేడుకల్లో ప్రత్యేక అతిథిగా పాల్గొనాలని కోరుతూ ఎమ్మెల్యే కోరం కనకయ్యను ఉత్సవ కమిటీ సభ్యులు. శుక్రవారం మండలంలోని కోయగూడెంలోగల స్వగృహంలో కలిసి ఆహ్వానించారు. ధరావత్ ప్రేమ్‌చంద్ నాయక్, బోడ మంగీలాల్, బానోత్ సక్రు, భూక్యా కిషోర్‌సింగ్, భూక్యా నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

కోదండరాంను కలిసిన గడ్డం ఆదాం

పర్ణశాల, ఆగస్టు 16: తెలంగాణ రాష్ట్ర జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీగా నియమించబడి నేడు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా విద్యార్థి జేఏసీ నాయకుడు గడ్డం ఆదాం శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బీకేఎంఎస్ నిర్మాణ కౌన్సిల్

పాల్వంచ, ఆగస్టు 16: బీకేఎంఎస్ జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం శుక్రవారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు కలకోట కాంతయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, నాయకులు వీసంశెట్టి పూర్ణ చందర్‌రావు, తాటి వెంకటేశ్వర్లు, ముత్యాల విశ్వనాథం, నరాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలపై పోలీసులకు ఫిర్యాదు

అశ్వారావుపేట టౌన్, ఆగస్టు 16: మండలంలోని నారంవారిగూడెం పంచాయతీ క్రీడామైదానం నుంచి మట్టిని ఎనిమిది మంది వ్యక్తులు అక్రమంగా తవ్వి రోడ్డు మరమ్మతుల పేరుతో తరలించారు. వారిపై పంచాయతీ కార్యదర్శి బట్టా వెంకటేశ్వర్లు శుక్రవారం పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

గుట్కాలు పట్టివేత

పాల్వంచ రూరల్, ఆగస్టు 16: మండలంలోని లక్ష్మీదేవిపల్లి, బసవతారక కాలనీ ప్రాంతాల్లోగల కిరాణా దుకాణాల నుంచి గుట్కా ప్యాకెట్లను రూరల్ ఏఎస్ఐ సుధాకర్ శుక్రవారం స్వాధీనపర్చుకున్నారు. దుకాణాదారులైన అశోక్, శశాంక్‌లపై కేసు నమోదు చేశారు.

వెబ్‌సైట్‌లో సింగరేణి సిబ్బంది వివరాలు

కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 16: శాప్ నుంచి ఎంప్లాయి పర్సనల్ ఇన్ఫర్మేషన్ సిస్టం వెబ్‌సైట్‌లో ఉద్యోగులకు సంబంధించిన అన్ని వివరాలను పొందుపర్చాలని సింగరేణి సీఎండీ బలరాం ఆదేశించారు. హెడ్డాఫీస్ రెండవ అంతస్తులో నూతనంగా నిర్మించిన ఐటీ, ఈఆర్‌పీ కార్యాలయాలను శుక్రవారం ప్రారంభించారు. ఉద్యోగుల సీఎంపీఎఫ్, గ్రాట్యుటీ, ఇంక్రిమెంట్స్, బదిలీలు, లీవులు తదితర అన్ని వివరాలను ఈ వెబ్‌సైట్‌లో పొందుపర్చాలన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ఇల్లెందు రూరల్, ఆగస్టు 16: ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలోని కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఇఫ్టూ జిల్లా కార్యదర్శి షేక్ యాకూబ్ షావలి ప్రభుత్వాన్ని కోరారు. ఆయన శుక్రవారం వైద్యశాలలో కార్మికులతో మాట్లాడారు. నాయకులు పాయం వెంకన్న, మల్ల వెంకటేశ్వర్లు, ఉమ, కృష్ణవేణి, వెంకటమ్మ, సుజాత, లక్ష్మి, రాము, పవన్, నిషార్ తదితరులు పాల్గొన్నారు.

యువతను మోసగించిన కాంగ్రెస్

దుమ్ముగూడెం, ఆగస్టు 16: యువతకు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను అమలుచేయకుండా మోసం చేసిందని, త్వరలో జరిగే కాంగ్రెస్ యూత్ కమిటీ ఎన్నికల్లో వారికి ఎవరూ ఓటువేయొద్దని బీఆర్ఎస్ యూత్ కమిటీ మండల అధ్యక్షుడు అల్లాడి వెంకటేష్ యువతకు పిలుపునిచ్చారు. శుక్రవారం లక్ష్మీనగరం బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువకులను అనేక రకాలుగా కాంగ్రెస్ మోసం చేసిందని, యువకులపై నిర్బంధాలు, అక్రమకేసులు బనాయించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో యువత కాంగ్రెస్‌కు సహకరించవద్దన్నారు. సమావేశంలో యూత్ నాయకులు పాల్గొన్నారు.